క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి

అమరాపురం: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక విశ్రాంతి భవనంలో పార్టీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్ ఆధ్వర్యంలో మండల స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని బూత్ కమిటీ సభ్యుల నియామకం చేయాలన్నారు. అలాగే సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అమరాపురం: మండలంలోని కాచికుంట గ్రామానికి చెందిన శివన్న కర్ణాటక రాష్ట్రం శిరలో బంధువుల పెళ్లికి గురువారం వెళ్లి తిరిగి వస్తుండగా ఉదుగూరు సమీపంలో విద్యుత్ స్తంభానికి ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఢీ కొంది. దీంతో ఆయన కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని 108లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి, అనంతరం మెరుగైన వైద్యం కోసం మడకశిర ఆస్పత్రికి తరలించారు.

వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి పరికరాలు అందిస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్

హిందూపురం అర్బన్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో గురువారం చిన్నారులకు వినికిడి యంత్రాలు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రోహిల్‌కుమార్ మాట్లాడుతూ బాల ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా వినికిడి లోపం ఉన్న చిన్నారులకు ప్రభుత్వం రూ.1.65 కోట్లతో శస్త్రచికిత్సలు చేయించిందన్నారు. వినికిడి యంత్రాలకు రూ.8 లక్షల వరకూ వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డా.రుక్మిణమ్మ, డీసీఈసీ మేనేజర్ రజిత, వైద్యులు అపర్ణ, గీతా, రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర కళ్యాణ మంటపం వద్ద గురువారం ఆపి ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లినట్లు బాధితుడు నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు పందులు కూడా ఎత్తుకెళ్లారు. అడ్డుకోబోయిన వారిపై రాళ్లు రువ్వినట్లు పందుల యజమానులు కూడా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు.

వాల్మీకులు సంఘటితం కావాలి

పావగడ: వాల్మీకులు సంఘటితం కావాలని అఖిల భారత వాల్మీకి గజ సంఘం రాజ్యాధ్యక్షుడు శ్రీనివాస నాయక పిలుపునిచ్చారు. స్థానిక అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన గజ సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకులు తమ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. మాట్లాడుతూ వాల్మీకి మహిళలు స్వావలంబన దిశగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా స్థానిక తాలూకా గజ సంఘం విభాగం ఎన్నికలు నిర్వహించారు. తాలూకా వాల్మీకి గజ సంఘం అధ్యక్షుడిగా గ్యాదికుంటె మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా కే రాంపురం ఆనంద్, ఉపాధ్యక్షులుగా గోపాల్, నాగేంద్ర, హనుమంతరాయ, గోపి,గోవింద, నరసింహ, న్యాయ సలహాదారుడిగా లాయర్ రాజణ్ణ, డైరెక్టర్‌గా హనుమంతరాయను నియమించారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం అర్బన్: అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ నేత మధుమతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆమె చౌళూరు పంచాయతీలోని వెంకటాపురంలో సర్పంచు నంజుండప్ప, ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణితో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మహిళలకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. నాయకులు రంగనాథ్, లోకేష్ రెడ్డి, రాజు, రామకృష్ణ, నవీన్, శీనప్ప, నాగరాజు తదితరులున్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- సమన్వయకర్త టీఎన్ దీపిక, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

చిలమత్తూరు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ హిందూపురం సమన్వయకర్త టీఎన్ దీపిక, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. గురువారం కొడికొండలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. అనంతరం సెర్ప్, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి కార్యక్రమంలో మహిళలకే పెద్దపీట వేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి జరగలేదని గగ్గోలు పెట్టే టీడీపీ నేతలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు చూసైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఎమ్మెల్యేలు స్థానికంగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని, బాలకృష్ణకు ఆహ్వానం అందించినా రారని, ఆయనకు నియోజకవర్గ ప్రజలపైన ఏమాత్రం అభిమానం ఉందో అర్థంచేసుకోవచ్చని జిల్లా అగ్రిబోర్డు చైర్మెన్ ఆవుటాల రమణారెడ్డి, సీనియర్ నేత మధుమతిరెడ్డి, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి విమర్శించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి, సర్పంచ్‌లు మురళీ మోహన్, శంకర్‌రెడ్డి, నీలీబాయి, ఎంపీటీసీలు ఆదినారాయణ, మంజునాథ్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, నాగరాజు యాదవ్, సింగిల్ విండో చైర్మన్ హనుమంతరెడ్డి, గిరిధర్ రాజు, ఈడిగ సూరి, నాగరాజుస్వామి, అంజన్ రెడ్డి, అశ్వర్థరెడ్డి, షాకీర్, నయీముల్లా, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త టీఎన్ దీపిక, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ,



మొరంపల్లిలో మినరల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మొరంపల్లిలో మినరల్ ప్లాంట్ ప్రారంభం

మొరంపల్లిలో ఏర్పాటు చేసిన మినరల్ ప్లాంట్‌ను నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ప్రారంభించారు. తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సమన్వయకర్త వెంటనే స్పందించి ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించగా 3 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జడ్జి శైలజ

హిందూపురం అర్బన్: సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. గురువారం కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, మహిళా ఉద్యోగులు, మహిళా న్యాయవాదులతో కలిసి కేక్ కట్ చేశారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మాట్లాడుతూ మహిళ లేనిదే సమాజం లేదన్నారు. కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకూ న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతోందని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. గురువారం మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, గుట్టూరు, అమ్మవారిపల్లి, గోనిపేట పంచాయతీల్లో బూత్ కమిటీల సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాలకు రాజ్యాంగ పదవుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సంక్షేమ పథకాలలో అన్ని వర్గాలకు కులాలకు, మతాలకు, పార్టీలకతీతంగా సమన్యాయం జరిగిందన్నారు.

గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో తన సొంత పార్టీ కార్యకర్తలకే ప్రజాధనాన్ని దోచిపెట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, జడ్పీటీసీ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు, సర్పంచులు, గౌతమి, లక్ష్మి, నాగరత్నమ్మ, అశ్వర్థనారాయణ, నాయకులు రామ్మోహన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కొండలరాయుడు, సుధాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, కాంట్రాక్టర్ రాము, నటేష్, నడిపి వెంకటరెడ్డి, ఆదినారాయణ, చంద్రారెడ్డి, మల్లికార్జున,నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన అందించే వారినే ఆదరించండి

పెనుకొండ రూరల్: సంక్షేమ పాలన అందించే వారినే ప్రజలు ఆదరించాలని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి,పెనుకొండ నియోజక వర్గం సమన్వయ కర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో, ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శేషాద్రి, తయ్యూబ్, వైస్ చైర్మన్ సునీల్, సుధాకర్ రెడ్డి, నాయకులు వెంకటేష్, గోపాల్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

చిలమత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. వీఆర్‌ఓలు, సర్వేయర్ల పనితీరుపై ఆరా తీసిన ఆయన ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. కార్యాలయంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. వెంటనే నూతన మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలపై ఆరా తీసిన ఆయన సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. త్వరలోనే సరిహద్దులోని తుమకూరు, చిక్కబళ్లాపురం జిల్లా అధికారులతో సమావేశాన్ని నిర్వహించి మద్యం అక్రమ రవాణాను కట్టడి చేస్తామని విలేకరులకు తెలిపారు. రీసర్వే డీటీ యూనిస్, సిబ్బంది ఉన్నారు.

ఆశా వర్కర్లకు అవగాహన

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో ఆశా డే సందర్భంగా మండలంలోని ఆశ వర్కర్లుకు డాక్టర్ శివనంద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మొద్దు



చరణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

గోరంట్ల: టీడీపీ అధినేత చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నేత చరణ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక షిర్డీసాయి కాలనీ, వన్నప్పనగర్, బృందవన కాలనీలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు ప్రవేశపెట్టి, ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాంనాయక్ , జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు డాక్టర్ బాషా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు నార్సింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, గోరంట్ల ఉపసర్పంచ్ రాజారెడ్డి, స్థానిక నాయకులు, ఆడవి శంకర్, మేదరశంకర, బక్షర్, తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లోకేష్ చిత్రపటాలను దహనం చేస్తున్న దృశ్యం

హిందూపురం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించేస్థాయి టీడీపీ నేత నారా లోకేష్‌కు లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి విమర్శించారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శంఖారావం సభకు అట్టర్ ఫ్లాప్ కావడంతో లోకేష్ ఫ్రస్టేషన్‌తో మంత్రి పెద్దిరెడ్డిపై అవాకులు చవాకులు పేలాడన్నారు. మంగళగిరి, కుప్పం, హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలువబోతోందని, దీంతో భయపడి వారు ఏవేవో మాట్లాడుతున్నారన్నారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రికి రూ.23 కోట్లు, సీటీస్కాన్ యంత్రానికి రూ.1.02 కోట్లు, పశువైద్యశాలకు రూ.4 కోట్లు ఏ ప్రభుత్వం ఇచ్చిందో లోకేష్ తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్ రూ.650 కోట్లతో పీఏబీఆర్ ద్వారా హిందూపురానికి తాగునీరు ఇచ్చారన్నారు. దీన్ని ఓర్వలేక గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా నీరిస్తామని చెప్పి రూ.160 కోట్ల మున్సిపాలిటీపై భారం మోపారన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ చిత్రపటాల దహనం

హిందూపురం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఏపి ఆగ్రో చైర్మన్ నవీన్ నిశ్చల్ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు అంబేడ్కర్ సర్కిల్ వద్ద నారా లోకేష్ చిత్రపటాలను దహనం చేశారు. నాయకులు వెంకటేష్‌రెడ్డి, మింటూ, శ్రీనివాసులు, బైలాంజినేయులు, కొల్లప్ప, రామాంజి, వరణ్, దాదు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం



హనుమంతనపల్లిలో మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. గురువారం మాజీ ఎంపీటీసీ సభ్యుడు క్రిష్టారెడ్డితో కలసి బసవనపల్లి పంచాయతీ పరిధిలోని బుల్లేపల్లి, హనుమంతనపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని బీసీ, ఎస్సీ కాలనీల్లోని ప్రజలను కలసి వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. గత నాలుగన్నరేళ్లుగా సీఎం జగనన్న అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, వాటిని ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా ఉండాలన్నారు. ఆయన మరోసారి ముఖ్యమంత్రిగా వుంటేనే సంక్షేమ ఫలాలు అందుతాయని, లేదంటే ఆగి పోతాయన్నారు. టీడీపీ నాయకులు మీ ముందుకు వచ్చి అబద్ధాలు చెబుతారని వాటిని నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రూ.4.84 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ

చిలమత్తూరు: గతేడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసిందని ఏఓ వంశీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో గతేడాది 6798 మంది రైతులు 9209 ఎకరాల్లో వేరుశనగ, మొక్కజొన్న, కందులు, రాగులు, పత్తి, ఉలవలు, జొన్న తదితర పంటలు వేసి నష్టపోయారన్నారు. దీంతో ప్రభుత్వం వారికి రూ.4.84 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ వారి ఖాతల్లో జమ చేసిందన్నారు. లబ్ధిదారుల వివరాలు ఆర్బీకేల్లో ఉన్నాయని తెలిపారు.

శంఖారావం సభ అట్టర్‌ఫ్లాప్



ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మడకశిరలో గురువారం జరిగిన శంఖారావం సభ అట్టర్ ఫ్లాప్ కావడంతోనే నారాలోకేష్ మతిస్థిమితం కోల్పోయి నాపై తప్పుడు ఆరోపణలు చేశారని ఎమ్మెల్యే తిప్పేస్వామి విమర్శించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ నారాలోకేష్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్యమైన నాయకులే శంఖారావం సభకు రాలేదని, ఈ విషయాన్ని గుర్తించకుండా తనపై అవినీతి ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలోనే చంద్రబాబు, లోకేష్ పెద్ద అవినీతిపరులని విమర్శించారు. రెండు ఎకరాల నుంచి రూ. కోట్లకు ఎలా ఎదిగారో ప్రజలకు నారాలోకేష్ చెప్పాలన్నారు. తనపై చేసిన అవినీతి ఆరోపణలను రుజువుచేస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని సవాల్ విసిరారు. లేకపోతే నీవు రాజకీయల నుంచి తప్పుకోవాలని సవాల్ చేశారు. నారా లోకేష్ నిజం తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

వేలం ద్వారా రూ.7.84 లక్షల ఆదాయం

మడకశిర: మున్సిపల్ కార్యాలయంలో గురువారం దినసరి మార్కెట్ సుంకం వసూలుకు వేలం నిర్వహించారు. వేలంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి రూ.7.84 లక్షలకు వ్యాపారులు దక్కించుకున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2.34 లక్షల ఆదాయం పెరిగింది. ఇదిలా ఉండగా వారపు సంత, బస్టాండ్ స్థలం సుంకం వసూలుకు నిర్వహించిన వేలానికి వ్యాపారులు హాజరు కాలేదని కమిషనర్ రంగస్వామి తెలిపారు.

ఘనంగా గిరిజా కల్యాణం

మడకశిర: స్థానిక సాయిబాబా దేవాలయం ఆవరణలోని దత్త బాణలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి గిరిజా కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని భక్తులు అరుణ, రవిప్రతాపరెడ్డి, వాసవి, నటరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, మెళవాయి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

చిలమత్తూరు: కొడికొండలో వెలసిన పంచనందీశ్వరాలయంలో గురువారం గిరిజా శంకరుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు , అభిషేకాలు చేశారు. రాత్రి గిరిజా శంకరులకు జరిగిన కల్యాణోత్సవం ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి , సుందరరాజు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే దేశాభివృద్ధి

మడకశిర రూరల్: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆర్డీటీ ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, సీఈఓ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో మెళవాయిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏటీఎల్ మాట్లాడుతూ మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తోందన్నారు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, మహిళలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అమరాపురం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని హేమ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ సూచించారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఏపీఎం తిప్పన్న, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రొళ్ల: మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించాలని రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ నళిని, డైరెక్టర్ నేత్రావతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, సీడీపీఓ నాగమల్లేశ్వరి సూచించారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా

సంక్షిప్త సమాచారం

నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. వివిధ కార్పొరేషన్లలో 50 శాతం వరకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీటీ భాగ్యలక్ష్మీ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, మహిళలు, వైకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏసీ నాగరాజు మాట్లాడుతూ సీఎం జగనన్న మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో లోకేష్, కల్పన, కమలమ్మ, మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. పట్టణానికి చెందిన జీవన జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ నాగజ్యోతి, వార్డెన్ భారతి మహిళా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ రమేష్, కళాశాల చైర్మన్ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నాయన్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అనంతపురానికి చెందిన డాక్టర్ ప్రసూన పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగింది. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినపుడే మహిళా దినోత్సవానికి అర్థం ఉంటుందన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, జేవీవీ నాయకులు హరి, ఇమ్రాన్, భారతి, నాగమణి, కేశవ తదితరులు పాల్గొన్నారు.